క్లుప్తంగా

అర్హులైన ఉపాధ్యాయులు ఓటరు నమోదు చేసుకోవాలి

భువనగిరి: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శనివారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యులు గుజ్జ బాలయ్య, కుమారస్వామి, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి

మోత్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ శనివారం మోత్కూరు తహసీల్దార్ రాంప్రసాద్‌కు బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రైతు భరోసా, వరి ధాన్యానికి బోనస్, పంటల బీమా తదితర హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పోచం సోమయ్య, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, పట్టణ నాయకులు చేకూరి మల్లేష్, ఎడ్ల రాము, అన్నెపు సత్యనారాయణ ఉన్నారు.

పూర్ణగిరిలో గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరి రూరల్: మండలంలోని నామాత్‌పల్లి పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీ నర్సింహస్వామి ఉపాసకులు బత్తిని రాములు గౌడ్ ప్రారంభించారు. అదేవిధంగా అనాజిపురం గ్రామ పరిధిలోని ఓబులేశ్వర ఆలయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భాస్కర్, సిరికొండ అశోక్, పిట్టల శ్రీశైలం, అందె సత్యనారాయణ, కృష్ణ, నాగేష్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి

ఆత్మకూరు(ఎం): కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. శనివారం ఆత్మకూరు మండలంలోని కూరెళ్లలో నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ కేంద్ర ప్రభుత్వం డిజిల్, పెట్రోల్ ధరలను తగ్గించడం లేదని ఆరోపించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా తుమ్మలగూడెం యాదయ్య, సహాయ కార్యదర్శిగా జక్కుల రమేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి భిక్షం పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గుట్ట ప్రాంతంలో మద్యం అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు శనివారం పలు కిరాణా షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత గుట్ట చౌరస్తాలోని చిందం వరప్రసాద్‌కు చెందిన రాంచరణ్ దుకాణంలో 13.485 లీటర్లు, పాత గుట్టలోని బైరగాని పాండుకు చెందిన రాజేష్ కిరాణా షాపులో 5.16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మల్లెపు బాలరాజు అనంతారం నుంచి భువనగిరికి బైక్‌పై వెళ్తుండగా ఎల్లమ్మ గుడి వద్ద తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈమేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఫోన్ ఆచూకీ కనిపెట్టి శనివారం బాధితుడికి అందజేశారు.

మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

భువనగిరిటౌన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై భువనగిరి పట్టణంలోని జలీల్‌పురలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి, కోశాధికారి రహీముద్దీన్, కమిటీ సభ్యుడు సుజావుద్దీన్ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై అవగాహన కల్పించడం, వారి సూత్రాలను తెలియజేయడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు ముసఫా ఖాదిరి. సెక్రటరీ ఇక్బాల్ అహ్మద్, ఇషాక్, ఫుర్ఖాన్ పాల్గొన్నారు.

మురుగు కూపాలు

రామన్నపేట: రామన్నపేట పట్టణంలోని వరద కాలువ మురుగు కూపంగా మారింది. ఏళ్ల తరబడి కాలువలో పూడిక తీయకపోవడంతో కంపచెట్లతో మూసుకుపోయింది. దోమలు, కాలువ నుంచి వచ్చే దుర్గంధంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టణ కేంద్రంలో భువనగిరిరోడ్డు వెంట ఉన్న కుమ్మరికుంట(లోతుకుంట) అలుగునీరు దిగువన ఉన్న చాకరికుంటలోని చేరేది. అందులో ఎక్కువైన నీరు వరద కాలువ గుండా వెంకటరామయ్య చెరువులోకి వెళ్లేవి. ఇరవై ఏళ్ల క్రితం వరకు ఉన్న వరద కాలువ స్వరూపం ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. వివిధ కాలనీలకు చెందిన డ్రైన్లు ఈ కాలువలో కలపడం వల్ల మురుగు కాలువగా మారింది. చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగు నీరు సాఫీగా వెళ్లడం లేదు. దీంతో స్థానికులు దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. మురుగు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రామన్నపేటలో కంపచెట్లతో మూసుకుపోయిన వరద కాలువ


రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కాలువలో నిలిచిన మురుగు

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీబీనగర్ మండలంలోని నీలంబావి- అనాజిపురం, సూరపల్లి చందుగానితండా, రామనిగుండ్ల తండా- ముగ్దుంపల్లి, శీనగానితండా- చిన్నరావులపల్లి గ్రామాల మధ్యన నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రూ.9కోట్ల 80లక్షల ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బీబీనగర్, భట్టుగూడెం, రాఘవాపురం గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోళి పింగళరెడ్డి, పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్, పంజాల రామాంజనేయులుగౌడ్, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, గోళి నరేందర్‌రెడ్డి, గడ్డం బాల్‌రెడ్డి, సురకంటి సత్తిరెడ్డి, నిఖిల్‌రెడ్డి, నివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

భూదాన్‌పోచంపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గౌతమి గ్రామర్ స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య, రావుల లక్ష్మి, ప్రొఫెసర్లు డాక్టర్ తడక యాదగిరి, అచ్చయ్య, కాంగ్రెస్ మండల, పట్టణఅధ్యక్షులు పాక మల్లేశ్‌యాదవ్, భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూధన్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


రామునిగుండ్లతండాలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలన

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని 15వ వార్డు అర్బన్ కాలనీలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ నివాసాల్లో అందుబాటులో ఉండి ఆధార్ కార్డు వివరాలు సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, కౌన్సిలర్లు నాజియా రెహమాన్ జహంగీర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

బీబీనగర్: పైలెట్ ప్రాజెక్టు కింద కొనసాగుతున్న డిజిటల్ కార్డు సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ అమరేందర్ సూచించారు. బీబీనగర్ మండలంలోని మహాదేవ్‌పురం గ్రామంలో కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు, ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్


చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. దసరా పండుగను పురస్కరించుకొని వరుస సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్లకు పయనం అయ్యారు. ఈ క్రమంలో రద్దీ ఏర్పడింది. జంక్షన్ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామికి ఘన నివాళి

రామన్నపేట: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాక) జయంతి సందర్భంగా శనివారం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీఓ యాకుబ్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ గాలయ్య, ఆర్‌ఐలు శోభ, రాజేశ్వర్, స్రవంతి, శైలజ, శ్రీధర్ పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, కమిషనర్ సి.శ్రీకాంత్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ఎంపీ వెంకటస్వామి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఎం పక్కీరయ్య, సిబ్బంది నరేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

గుండాల: వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం గుండాల మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌రెడ్డి, చేనేత సహకార సంఘం చైర్మన్ ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ సైదులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్ కుమార్, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలో శనివారం గడ్డం వెంకట్‌స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ వెంకట్‌స్వామి చిత్ర పటానికి నివాళులుర్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు గడ్డ జ్ఞాన ప్రకాష్ రెడ్డి, సంధ్యారాణి, కళమ్మ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


యాదగిరిగుట్ట రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

అన్నపూర్ణాదేవిగా దుర్గామాత

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్థిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు భక్తులకు శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు.

భువనగిరి: దేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. స్థానిక నల్లగొండ చౌరస్తాలోని శ్రీ రాంతడాక్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆజాద్ రోడ్డులో శ్రీరామ భక్త భజన మండలి కమిటీ ఆధ్వర్యంలో దేవి మండపం వద్ద అన్నదానం చేశారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపురంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డొంకెన ఉమేష్, నూనె బాలు, రావుల శరత్ చంద్ర, జిన్న ప్రకాష్, ఉడుత మహిపాల్, బాషపెల్లి రాజ్‌కుమార్, జిన్న బాస్కర్ రావు, సింహాద్రి పాల్గొన్నారు.

మోత్కూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మ వారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అంగడిబజార్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూరు(ఎం): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

రామన్నపేట: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వెల్లంకిలో హోమం నిర్వహించారు.

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ కూరాకుల వెంకటేశ్వరరావు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు సైదులు, ప్రధాన కార్యదర్శి కొత్తోజు నవీన్, బీరుమల్లు పాల్గొన్నారు.

చౌటుప్పల్: దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వైద్యురాలు శ్వేతప్రియాంక-సుధీర్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం కార్యక్రమాన్ని సింగిల్‌విండో చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం ప్రారంభించారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని శివ యువజన సంఘం, మర్యాల, తిమ్మాపూర్, నాగినేనిపలి గ్రామాల్లో దుర్గామాత అమ్మవారిని శనివారం అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, కుషంగల సత్యనారాయణ, కుక్కదువ్వ గణేష్, రాజేష్ పైలెట్, తంతపల్లి సత్తిరెడ్డి, పాపిరెడ్డి, పెంటారెడ్డి, ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని కొత్త గుండ్లపల్లి, శ్రీరాంనగర్, పాత గుండ్లపల్లి, వైకుంఠ ద్వారం వద్ద, యాదగిరిపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల చెంత నిర్వాహకులు, భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద బొబ్బల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మద్దెలమ్మ దేవి దేవాలయం వద్ద లక్ష పుష్పార్చన, సహస్రకుంకుమార్చన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


భూదాన్‌పోచంపల్లి: అన్నదానంలో పాల్గొన్న భక్తులు


యాదగిరిగుట్ట: పూజల్లో పాల్గొన్న భక్తులు


రామన్నపేట: దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు, మాజీ ప్రజాప్రతినిధులు

లీకేజీలపై స్పందించాలి

మోత్కూరు: నీటి సరఫరా లీకేజీలపై మంచి నీటి సహాయకులు తక్షణమే స్పందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య అన్నారు. మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లోని మంచి నీటి సహాయకుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రజ్ఞాపురం కరుణాకర్, ఎంపీడీఓ నిరంజన్‌వలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష పాల్గొన్నారు.

నీటి సహాయకులకు ముగిసిన శిక్షణ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని గ్రామ మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఈ పద్మావతి, ఎంపీడీఓ రాములు నాయక్, సూపరింటెండెంట్ ఎలిమినేటి లోకేశ్వర్ రెడ్డి, ఏఈ మోహర్‌సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలి

వలిగొండ: ప్రజలకు స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని అందించాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత అన్నారు. మంచినీటి సహాయకులకు శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం వలిగొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, డీఈఈలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

గుండాల: గుండాల మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ నీటి సహాయకులకు నాలుగు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఈఈ కరుణాకరన్ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఊళ్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి

మోత్కూరు: దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మోత్కూరు ఎస్ఐ నాగరాజు అన్నారు. శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దొంగతనాలపై అవగాహన కల్పించారు. అనుమానితులు కనిపిస్తే 100, 87126 67510కు డయల్ చేయాలని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

మోత్కూరు: రైతులు ఆయిల్‌పామ్ సాగుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని మోత్కూరు మండల వ్యవసాయ అధికారి కీర్తి అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామ పరిధిలో జెటంగిబావి మధిరలో ఉన్న రైతు పరాల మంజులభాస్కర్ ఆయిల్‌పామ్ తోటను శనివారం ఆమె సందర్శించారు. ఆమె వెంట ఆయిల్ ఫెడ్ క్లస్టర్ ఆఫీసర్ మమత, ఏఈఓ అశోక్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వలిగొండ: హైదరాబాద్లో ఈ నెల 9న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ కావలి యాదయ్య అన్నారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్యారారంలో వైద్యశిబిరం

బొమ్మలరామారం: మండలంలోని ప్యారారం గ్రామంలో శనివారం ఉస్మానియా మెడికల్ కాలేజ్ మెడికల్ స్టూడెంట్స్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలో ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేశారు. గ్రామాన్ని మూడు సంవత్సరాల పాటు దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నెలలో 2వ, 4వ శనివారం గ్రామస్తులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. దత్తత తీసుకున్నందుకు వైద్యులకు, వైద్య విద్యార్థులకు మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా ప్రొఫెసర్ నీలిమా, అసిస్టెంట్ ప్రొఫెసర్ పావని, మనీజా, రితిక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చౌటుప్పల్: దేవలమ్మనాగారం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు దేవలమ్మనాగారం, అల్లాపురం, పీపల్‌పహాడ్, ఎనగండితండాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ట్రాన్స్‌కో ఏఈ సతీష్ శనివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టేకుల సోమారం చెరువును నింపాలి

వలిగొండ: వలిగొండ మండలంలోని టేకుల సోమారం చెరువుపై భాగంలో కాళేశ్వరం కాల్వకు తూము ఏర్పాటు చేసి టేకుల సోమవారం చెరువును గోదావరి జలాలతో నింపాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శనివారం టేకులసోమారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, కమిషనర్ శ్రీకాంత్‌లకు వినతి పత్రం అందజేశారు. నివాస గృహాలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని, పందుల బెడద తీవ్రంగా ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చొల్లేటి నరేష్, కార్యదర్శి దర్శనం వెంకన్న, మల్లేషం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మోత్కూరు: మోత్కూరు మండలంలోని పాడిచేడు గ్రామానికి చెందిన జిట్ట బాలనర్సయ్య, ఎర్ర లింగమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, గ్రామ మాజీ సర్పంచ్ పేలపూడి మధు శనివారం పరామర్శించి, రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

మూర్ఛతో చేనేత కార్మికుడు మృతి

రామన్నపేట: ఫిట్స్ రావటంతో రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు మేకల నరేష్(38)కు ఐదు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం అతడికి ఫిట్స్ వచ్చింది. కుటుంబసభ్యులు రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రామన్నపేట ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

కేబుల్ వైర్లు చోరీ

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరంలో రైతు వ్యవసాయ పొలాల వద్ద బోరు మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామంలోని పలువురు రైతులు స్థానిక పెద్దచెరువు సమీపంలో మోటార్లను ఏర్పాటు చేసి పంట పొలాలకు నీరు పారిస్తున్నారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 80మందికి పైగా రైతుల బోరు మోటార్ల కేబుల్ వైర్లను స్టార్టర్ల వద్ద కట్‌చేసి ఎత్తుకెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులతో పాటు తెలంగాణ మోడల్‌స్కూల్‌లో కేర్ టేకర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ ప్రభాకర్ శనివారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు తమ విద్యార్హుల సర్టిఫికెట్లతో ఈ నెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గిరిజన గురుకుల విద్యాలయంలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్, అసిస్టెంట్ కుక్ ఉద్యోగాలకు అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ గోలి శ్రీనివాస్ తెలిపారు.

గుండాల: మండల కేంద్రంలోని కేజీబీవీలో డే వాచ్‌మెన్ మహిళా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ మన్నె అగ్గి రాములు శనివారం తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి, పదో తరగతి విద్యార్హత, ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీల్లో శిక్షణ పొందిన మహిళలు అర్హులని పేర్కొన్నారు.

మోత్కూరు: మోత్కూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న సహాయక వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు అర్హులని పేర్కొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని మల్యాల గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డే వాచ్‌ఉమెన్ పోస్టు భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రోజారాణి శనివారం తెలిపారు. దరఖాస్తులను కేజీబీవీ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు


భువనగిరి పట్టణంలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


చౌటుప్పల్‌లోని గాయత్రి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినుల సందడి


యాదగిరిగుట్ట: యాదగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు



రామన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు